ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుల నియామకం

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ బాధ్యులను కూడా ప్రకటించిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



చీమకుర్తి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసే పరిశీలకులను సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆదివారం రాత్రి ప్రకటించారు. చీమకుర్తి పట్టణానికి పాకనాటి మహానందరెడ్డి, యర్రా దశరథరామయ్య, నారా విజయలక్ష్మి, చీమకుర్తి రూరల్‌కు మారెడ్డి సుబ్బారెడ్డి, నర్రా సురేష్‌కుమార్, పేరాల చెన్నకేశవులను నియమించారు. సంతనూతలపాడు మండలానికి ఇనగంటి పిచ్చిరెడ్డి, పోతినేని శ్రీనివాసరావు, కొలకలూరి విజయ్‌కుమార్‌ను నియమించారు. మద్దిపాడు మండలానికి కరణం రమేష్, మారెడ్డి వీరారెడ్డి, బత్తుల ప్రసన్నకుమార్, నాగులుప్పలపాడు మండలానికి గట్టినేని అయ్యన్న, ఎస్‌కే మహ్మద్ అలీ, పల్లకి సత్యనారాయణరెడ్డి, పేర్నమిట్ట డివిజన్‌లకు పోలినేని కోటేశ్వరరావు, సూడిదేల విజయ్‌భాస్కర్‌రెడ్డి, పాటిబండ్ల గంగయ్యను నియమించారు.

మండలాల వారీగా బాధ్యుల నియామకం...

వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలను పర్యవేక్షించేందుకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు బాధ్యులను నియమించారు. చీమకుర్తి అర్బన్ బాధ్యులుగా క్రిష్టిపాటి శేఖరరెడ్డి, చల్లా అంకులు, బాపతు వెంకటరెడ్డి, నల్లమలపు మాణిక్యం, మంచా హరికృష్ణను నియమించారు. చీమకుర్తి రూరల్‌కు పమిడి వెంకటేశ్వర్లు, వేమా శ్రీనివాసరావు, యద్దనపూడి శ్రీనివాసరావు, రావి లక్ష్మయ్య, జ్యేష్ఠ శ్రీనివాసరావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డిని నియమించారు. సంతనూతలపాడు మండలానికి దుంపా చెంచిరెడ్డి, దుంపా రమణమ్మ, బీ విజయ, వెంకట నారాయణ, రాఘవమ్మ, దుంపా యలమందారెడ్డిని నియమించారు. మద్దిపాడు మండలానికి మండవ అప్పారావు, వాకా కోటిరెడ్డి, తేళ్ల పుల్లారావు, మూరబోయిన సంజీవరావు, ఉప్పలపాటి వెంకట్రావు, బత్తుల శ్రీనివాసరావును నియమించారు. నాగులుప్పలపాడు మండలానికి పోలవరపు శ్రీమన్నారాయణ, నలమలపు కృష్ణారెడ్డి, యాదాల అశోక్, కన్నా రాధ, మల్లెల జాన్సన్, కుమ్మూరి సుధాకర్‌ను నియమించారు. పేర్నమిట్ట డివిజన్‌లకు కత్తినేని చెంచురామిరెడ్డి, గోలి తిరుపతిరావు, తేళ్ల చంద్రశేఖర్, నూకతోటి ఈశ్వరరావు, కండే రమణయాదవ్, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎస్‌కే నవీన్‌ను నియమించారు. వీరంతా ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్ సీపీ తరఫున బాధ్యులుగా వ్యవహరించి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు.

ఎమ్మెల్యే టీజేఆర్ ప్రచారం నేడు...

ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సోమవారం సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేయనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ తరఫున పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీ చంద్రశేఖరరెడ్డిని గెలిపించాలని తక్కెళ్లపాడు, బీ నిడమానూరు, కొత్తకోట, పోతవరం, కళ్లగుంట, ఒమ్మెవరం, ఉప్పుగుండూరు, మట్టిగుంట, ఈదుమూడి, ముప్పాళ్ల, తిమ్మసముద్రం గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, పరిశీలకులు, బాధ్యులు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, నాయకులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు అంబేడ్కర్‌నగర్‌లో ఓటు హక్కు కలిగిన వారి ఇళ్లకెళ్లి ఆదివారం ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారికి సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు అందించారు. పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్ ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీ చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్నట్లు తెలిపారు. వారిని మంచి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు బాపట్ల సుబ్బారావు, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమహాలక్ష్మమ్మ జయంతి ఉత్సవాలు



శ్రీమహాలక్ష్మమ్మ ఆవిర్భావాన్ని వివరిస్తున్న పొన్నూరు

ఒంగోలు టౌన్: స్థానిక గాంధీరోడ్డులోని గీతామందిరంలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న శ్రీమహాలక్ష్మమ్మ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అమ్మ జననం, జగద్గురువులు ఆదిశంకరులు చెప్పిన కనకధారా స్తోత్రంపై ప్రవచనం చేశారు. శ్రీమహాలక్ష్మమ్మ అనుగ్రహంతో సిరిసంపదలు, సుఖశాంతులు లభిస్తాయని చెప్పారు. ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున క్షీర సాగర మదనం నుంచి శ్రీ మహాలక్ష్మమ్మ ఆవిర్భవించినట్లు వివరించారు. సర్వజగత్తును నడిపించగల శక్తి మహాలక్ష్మమ్మకు మాత్రమే ఉందని, ఆమె అనుగ్రహం కోసం నిత్యం ఉపాసన చేయడం ఒక్కటే మార్గమని అన్నారు. అమ్మ అనుగ్రహం కోసం ఆదిశంకరాచార్యులు కనకధారా స్తోత్రం పఠించి పేద బ్రాహ్మణి దారిద్ర్యాన్ని తొలగించి బంగారు ఉసిరికల వర్షం కురిపించిన కథాగమనాన్ని ఆసక్తికరంగా వినిపించారు. ప్రతిఒక్కరూ అమ్మ అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆకాంక్షించారు. గీతామందిరం భక్తులు కృష్ణ, సరేఖ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఖాతా.. భవిష్యత్‌కు నావ

- ఆడబిడ్డలకు వరం సుకన్య సమృద్ధి యోజన
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



సుకన్య సమృద్ధి యోజన

వేటపాలెం: ఆడపిల్ల పుడితే భారంగా అనిపించే రోజులు పోయాయి. ఇప్పుడు ఆడపిల్లలే భవిష్యత్ తరాలకు దిక్సూచిలా ఉన్నారంటే అతిశయోక్తికాదు. కొంచెం వారిని ప్రోత్సహించి దారి చూపిస్తే ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తారు. బాలికల భవితను బంగారు మయం చేసే సుకన్య సమృద్ధి యోజన తల్లిదండ్రులకు వరం లాంటిది. జిల్లా వ్యాప్తంగా లక్షకుపై బడి పదేళ్లలోపు వయస్సు కలిగిన బాలికలు ఉన్నారు. అయితే ఈ పథకం గురించి ప్రచారం లోపం కారణంగా ఎక్కువ మంది వినియోగించుకోవడం లేదు. సమాజంలో ఆడపిల్లపై ఉన్న వివక్షతా భావం పోగొట్టే లక్ష్యంతో 2015 జనవరిలో 'బేటీ బచావో, బేటీ పడావో' (సేవ్ ది గరల్స్ చైల్డ్, ఎడ్యుకేట్ ది గరల్స్ చైల్డ్) పాలసీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా ఉన్న బాలికలల్లో 25 శాతం మంది కూడా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవలేకపోయారు. దీనికి ప్రధాన కారణం ఈ పథకం ఆవశ్యకత గురించి వారి తల్లిదండ్రులకు తెలియకపోవడమే కారణంగా చెప్తున్నారు.

పథకం ఉద్దేశం ఇదే..

అప్పుడే పుట్టిన ఆడపిల్లల మొదలు పదేళ్లలోపు వయసున్న బాలిక వరకూ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఈ ఖాతాను తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులు తెరవవచ్చు. ఒక కుటుంబంలో ఇద్దరు బాలికలకు వర్తిస్తుంది. ఒకటి లేదా రెండో ప్రసవంలో కవలలు పుట్టిన ఇద్దరు బాలికలు ఉంటే మూడో అమ్మాయికీ ఖాతా తెరవవచ్చు.

పన్ను మినహాయింపు ఉపయోగం..

సుకన్య సమృద్ధి యోజనలో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కూడా పొందవచ్చు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక ఏడాదిలో రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. అందువల్ల ఉద్యోగం చేసే వారికి ఈ స్కీమ్ చాలా అనువుగా ఉంటుందని చెప్పుకోవచ్చు.

ఇవీ ఉపయోగాలు..

- ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలు ఖాతా తెరిచిన నాటి నుంచి 15 ఏళ్ల పాటు పొదుపు చెల్లించాలి.
- 21 సంవత్సరాల తరువాత వడ్డీతో కలిపి పూర్తి సొమ్ము పొందవచ్చు. లేదా అమ్మాయికి 18 ఏళ్ల వయస్సులో చదువుకు డబ్బు అవసరమైతే ఖాతా నుంచి 50 శాతం మొత్తాన్ని పొందవచ్చు.
- ఖాతాలో మొత్తానికి చక్రవడ్డీ లభిస్తుంది. ఆర్థిక సంవత్సర ఆరంభంలో వడ్డీలో మార్పును ప్రకటిస్తారు.
- ఒక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కనీస మొత్తం రూ. 250 మొదలు గరిష్టంగా రూ. 1.50 లక్ష వరకు చెల్లించవచ్చు.
- కనీస మొత్తం చెల్లించకపోతే ఏడాదికి రూ. 50 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తారు. కనీస మొత్తం రూ. 250 చెల్లించి ఖాతాను పునరుద్ధరించుకోవచ్చు.
- ఖాతాలో జమ చేసిన సొమ్ము మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. ఏ తపాలా కార్యాలయంలోనైనా ఉచితంగా తెరవవచ్చు. బదిలీ కూడా చేసుకునే అవకాశం ఉంది.
- సుకన్య సమృద్ధి యోజనపై ప్రస్తుతం 7.6 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ వడ్డీ రేటు ఎప్పటికీ ఒకేలా ఉండదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను సమీక్షిస్తూ ఉంటుంది. అందువల్ల వడ్డీ రేట్లు పెరగొచ్చు. లేదంటే తగ్గొచ్చు. కొన్ని సందర్భాల్లో వడ్డీ రేట్లు నిలకడగా కూడా కొనసాగవచ్చు.

> **సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు ఆసరా..**
>
> కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లలకు ఆసరానిస్తుంది. ఆడపిల్లల కలిగిన తల్లిదండ్రులు ఈ పథకంలో చేరి వారి చిన్నారులకు మంచి భవిష్యత్ ఇవ్వొచ్చు. మీ గ్రామంలోని పోస్టాఫీసుల్లోగాని లేదా ఏదేని జాతీయ బ్యాంకుల్లో కూడా ఈ పథకం ప్రారంభించుకోవచ్చు. ప్రస్తుతం 7.06 శాతం వడ్డీ లభిస్తోంది. ప్రతి మూడు నెలలకు వడ్డీ మారుతుంది.
>
> ఎల్. శ్రీనివాసరావు, పోస్టుమాస్టర్, వేటపాలెం

మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మావతి



లక్ష్మీపద్మావతిని సత్కరిస్తున్న వాసవీ క్లబ్ నాయకురాళ్లు

ఒంగోలు: మహిళల అవసరాన్ని, ప్రాధాన్యతను ప్రపంచం యావత్తు గుర్తించిందని, ఈ నేపథ్యంలో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు, ఏపీ ఆర్యవైశ్య మహిళా విభాగ్ ఉపాధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మావతి మహిళలకు పిలుపునిచ్చారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, ఉపాస్ హాస్పిటల్స్ సంయుక్తంగా స్థానిక రామానుజ కూటమిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిద్దా లక్ష్మీపద్మావతిని ఉపాస్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ కొప్పుల జ్యోత్స్న, డాక్టర్ ప్రకాష్ చవల, వాసవీ క్లబ్ మహిళా నాయకురాళ్లు సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా అధికారి కనమర్లపూడి ప్రియదర్శిని, అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, గవర్నర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, జిల్లా అధికారి అప్పల మాధవి, వెంకటలక్ష్మి, వాసవీ క్లబ్ మహిళా విజన్, ఒంగోలు వాసవీ క్లబ్, ఒంగోలు సిటిజన్స్, కేసీజీఎఫ్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను పెంపొందించాలి



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఒంగోలు టౌన్: చిన్నారుల్లో చదువుతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించాలని, అలాంటి విషయాలపై వారికి ఆసక్తి కలిగించడమే తమ లక్ష్యమని టైని బెల్స్ స్కూల్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. స్థానిక నెల్లూరు బస్టాండ్ సమీపంలోని టైని బెల్స్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బాలల్లో చదువుపై ఇష్టం పెరిగేలా విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సుజిత శేఖర్, ప్రిన్సిపాల్ వేణి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



కరేడులో ధ్వజ స్తంభ గ్రామోత్సవం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడులో నూతనంగా నిర్మించిన కృష్ణుడి గుడి ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా ధ్వజస్తంభ సహిత కృష్ణ పరమాత్మ శిలా విగ్రహం గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం అనుజ్ఞ పుణ్యాహం, అంకురార్పణం, ధాన్యాధి వాసం కార్యక్రమాలు జరిపారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



పోలేరమ్మకు పొంగళ్లు వండుతున్న భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మూడో ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. మార్కాపురంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించటం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కుంకుమ బండ్లతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. బోనాలను సమర్పించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు అన్ని ఏర్పాట్లను చేశారు. ఆలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాగమయ్య శిలలు, నాగమయ్య పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మార్కాపురంలోని కాలేజీ రోడ్డులో ఉన్న పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగా భవానికి విశేష పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి రూ. 6. 255 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దండి



వెంకాయమ్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

దర్శి: పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా విద్యను అందించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక గౌతమి గ్రామర్ స్కూల్‌లో 13వ వార్షికోత్సవంలో ఆమెతో పాటు నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ పాపసాని రాజకేశవరెడ్డి వారిని దుశ్శాలువాలు మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యలో వస్తున్న నూతన మర్పులను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, ప్రముఖ హోమియో వైద్యులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వరి గడ్డి వామి దగ్ధం

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లెలో ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పు అంటుకుని దగ్ధమైన సంఘటన ఆదివారం జరిగింది. సాతర్ల చెన్నయ్య పశువుల మేత కోసం వరిగడ్డిని ఇంటికి సమీపంలో నిల్వ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా కంభం అగ్నిమాపకదళ సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకదళ సిబ్బంది

క్లుప్తంగా

ఉమామనోవికాస కేంద్రంలో నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

ఒంగోలు: స్థానిక ఉమామనోవికాస కేంద్రంలోని విద్యార్థులకు ఆదివారం నిత్యావసరాలు అందజేశారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా మాదిగ జన సేవా సమితి కో ఆర్డినేటర్ గద్దల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమామనోవికాస కేంద్రం ప్రిన్సిపాల్ ఈశ్వర్, అధ్యక్షుడు చావలి బాలకోటయ్య, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

ఒంగోలు: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన పూసల రవి జిల్లా వాసులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతికేళ్లుగా న్యాయవాదిగా సేవలందిస్తున్నానని, తనకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు వీజీఆర్ నారగోని, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వీరరాఘవస్వామి



వాహనంపై ఊరేగుతున్న స్వామి

చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో గల వీరరాఘవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిత్య హోమం, ప్రాతరోపాసన, బలిహరణలు నిర్వహించారు. రాత్రి వేదవల్లి కనకవల్లీ సమేత వీరరాఘవస్వామి దేవతామూర్తులను హనుమంత వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ పర్యవేక్షించారు, అర్చకస్వామి దిట్టకవి వాసుదేవాచార్యులు, యాజ్ఞీకులు తాళ్లూరి వెంకటేష్ ఆచార్యులు అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి పడిపోయి తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం సాయంత్రం మార్టూరులో చోటు చేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ అందించిన సమాచారం ప్రకారం దర్శికి చెందిన కే ప్రసాద్‌రెడ్డి తన బైకుపై విజయవాడలో పరీక్ష రాసి తిరిగి తన గ్రామానికి వెళ్తున్నాడు. మార్టూరు చైతన్య స్కూలు సమీపంలో జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కాగా అతనిని 108 సిబ్బంది చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం దుకాణం సూపర్ వైజర్ చేతివాటం

చినగంజాం: ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన చేతి వాటం ప్రదర్శించి మద్యం బాటిళ్లు అమ్ముకున్నాడు. ఈఘటన ఇంకొల్లుపోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇంకొల్లు ఎస్సై షేక్ నాయబ్ రసూల్ వివరాల మేరకు.. ఇంకొల్లు-పర్చూరు రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్న మార్టూరి వెంకట ప్రశాంత్ వైన్ షాపులోని 42 మద్యం సీసాలను అక్రమంగా బయటకు తరలించాడు. తాను దొంగిలించిన మద్యం సీసాలను అధిక ధరకు అమ్మి లాభం గడించేందుకు 4 వతేదీ రాత్రి ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు వద్ద ఉన్నాడు. ఎస్సైకు అందిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ పీ సుధాకరరావు, తన సిబ్బందితో ప్రశాంత్‌ను పట్టుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నాడు. ఈ మేరకు అతనిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపాడు.

కోడి పందెం శిబిరంపై దాడి

వేటపాలెం: కోడిపందెం శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ శివారులో నిర్వహిస్తున్న శిబిరంపై దాడిచేసి నిర్వాహకులు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీ సురేష్ ఆదివారం తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆకస్మికంగా దాడులు చేశామని చెప్పారు. ఎనిమిది మందితో పాటు, రెండు కోళ్లు, రెండు ఆటోలు, రెండు మోటార్ బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.